


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 24-07-2026 | సంపుటి - 30 | సంచిక - 61 | రూ : 4 | పేజీలు: 8


## గ్లోబరీనా...
# కేటీఆర్ బినామీ సంస్థ

- మీకు సంబంధం లేకపోతే సీసీఎస్‌లో ఫిర్యాదు చేస్తే నిజాలు నిగ్గు తేలుస్తాం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- 2019లో ఇంటర్ ప్రశ్నపత్రాల లీకేజీతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపణ
- 'నీట్' లీకేజీపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను భారాస ఎందుకు డిమాండ్ చేయలేదని సూటి ప్రశ్న



హైదరాబాద్: గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో నిజాయతీ నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ''గత ప్రభుత్వ హయాంలో 2019లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఆ సంస్థ వ్యవహరించిన తీరుతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడింది వాస్తవం కాదా? ఆ సంస్థ కేటీఆర్ బినామీ. కేటీఆర్‌కు.. ఆ సంస్థకు.. జన్వాడకు సంబంధం లేదని భావిస్తే.. సీసీఎస్‌లో ఫిర్యాదు చేయాలి. ఎందుకంటే మేము విచారణ చేస్తే.. కక్ష సాధింపు అంటారు. కేటీఆరే ఫిర్యాదుచేస్తే.. అప్పుడు దాని లోతుపాతులు వెలికితీస్తాం. విచారణలో నిజాలు నిగ్గుతేలుస్తాం. రాష్ట్రంలో 2019లో జరిగిన ఇంటర్ పరీక్షల వ్యవహారం కేసుపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. నివేదిక వచ్చాక ఆ వివరాలు చెబుతా. గ్లోబరీనా వ్యవహారంలో అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ క్షమాపణ చెప్పాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభ

తరువాయి 2లో

## రెండో విడతలో కొత్తగా
# 7,897 మందికి బీటెక్ సీట్లు

మిగిలిపోయిన సీట్లు 14,257, 28లోపు రిపోర్ట్ చేస్తేనే సీటు నిలిచేది

2లో



## నీట్ పేపర్ లీకేజీ
# ముమ్మాటికీ మహాపాపమే

2లో

- తప్పును సరిదిద్దేందుకే మళ్లీ పరీక్షను నిర్వహించాం
- తెలంగాణలో ప్రశ్నపత్రాలు లీకైతే విద్యాశాఖను చూసే సీఎం బాధ్యత వహించారా?
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



## డీఆర్‌డీఓ మరో ఘనత..
## 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం



- ఒడిశా తీరంలో పరీక్ష నిర్వహించిన డీఆర్‌డీఓ
- సుదూర గగనతల లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం
- రక్షణ రంగంలో ఇదొక మైలురాయి అన్న రాజ్‌నాథ్ సింగ్
- విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వెల్లడి

2లో



## ప్రధాని మోదీ హామీ..
# గంటల్లోనే కార్యాచరణ

- ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు
- కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద పేపర్ లీకేజీ కేసుల విచారణ
- దోషులుగా తేలితే 5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా
- తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలి పెట్టేది లేదన్న మోదీ

2లో

## క్వాంటం పరిశోధనలకు అమరావతి బెస్ట్ ప్లేస్
# క్వాంటినమ్ సీఈఓతో సీఎం భేటీ



- క్వాంటం హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దడంపై కీలక చర్చలు
- ఈ ఏడాది డిసెంబరు నాటికి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ప్రారంభం
- ఏపీతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు క్వాంటినమ్ ఆసక్తి
- క్వాంటం పరికరాల ఉత్పత్తికి సహకరిస్తామన్న సంస్థ ప్రతినిధులు

2లో



## వర్షాలు, వరదలతో అసోం విలవిల
## 41కి చేరిన మృతుల సంఖ్య

## మెట్రో స్టేషన్ల బంద్.. లంచ్ టైంలోగా తేల్చండి
# లేదంటే నేనే రంగంలోకి దిగుతా

- ఢిల్లీలో నిరసనల కారణంగా పలు మెట్రో స్టేషన్ల మూసివేత
- విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లిన బార్ అసోసియేషన్
- కోర్టుకు రాలేకపోతున్న న్యాయవాదులు, సిబ్బంది ఇబ్బందులు
- మధ్యాహ్నం లోగా సమస్య పరిష్కారం కాకపోతే జోక్యం చేసుకుంటానన్న సీజేఐ
- సుప్రీంకోర్టు స్టేషన్ సహా 16 స్టేషన్ల సేవలు నిలిపివేత



# నీట్ పేపర్ లీకేజీ ముమ్మాటికీ మహాపాపమే

దిల్లీ: నీట్ పేపర్ లీకేజీ ముమ్మాటికీ మహాపాపమేనని, తప్పు జరిగిందనే పరీక్షను రద్దు చేసి సమర్థంగా మళ్లీ నిర్వహించినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణలో 2025లో పదో తరగతి ప్రశ్నపత్రాలు లీకైతే విద్యాశాఖను చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. జగిత్యాలలో గత విద్యాసంవత్సరం అగ్రికల్చర్ బీఎస్సీ పేపర్ లీకైందని, దానికి బాధ్యత ఎవరిదని నిలదీశారు. ఈ మేరకు గురువారం కిషన్‌రెడ్డి దిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ... "కొందరు ఉపాధ్యాయులు స్వార్థంతో విద్యార్థుల జీవితాలు నాశనం కావడానికి కారణమయ్యారు. పేపర్ లీకేజీకి కారణమైన 17 మందిని జైల్లో పెట్టించాం. మళ్లీ పరీక్షను నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేశాం. పేపర్ లీకేజీల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి 2024లో చట్టం చేశాం. త్వరలో జీరో టాలరెన్స్ పాలసీ తీసుకొస్తున్నాం. దీనికి అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు సహకరించాలి. విద్యార్థుల భవిష్యత్తుపై ఆలోచించకుండా కాంగ్రెస్ పార్టీ అనవసరంగా రాద్ధాంతం చేస్తోంది. సభలో నీట్‌పై ఎంతసేపైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. వారిచ్చే సూచనలు తీసుకుంటాం. అంతేకానీ రోడ్లపై ధర్నాలు చేయడం, పార్లమెంట్ సమావేశాలను అడ్డుకోవడం అప్రజాస్వామ్యం. తెలంగాణలో శాసనసభ ఎన్నికలప్పుడు విద్యార్థులతో అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీలో మాట్లాడిన విషయాలు రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీలకు గుర్తున్నాయా? కోదండరాంకు ఉద్యోగం వచ్చాక నిరుద్యోగుల్ని మరచిపోయారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. భారాస పాలనలో టీజీపీఎస్సీ పేపర్లు లీకై విద్యార్థులు నానాఅవస్థలు పడ్డారు. అప్పుడే తప్పు జరగనట్లు ఇప్పుడు కేటీఆర్ మమ్మల్ని విమర్శిస్తున్నారు" అని ఆరోపించారు.

*** అది పేపర్ లీకేజీ కాదు... కేవలం దొంగతనం: రఘునందన్‌రావు**

నీట్ పేపర్ లీకైందని విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, అది దొంగతనం మాత్రమేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. "ఇది ఒకచోట ఒకరిద్దరు చేసిన తప్పు మాత్రమే. కాక్రోచ్ జనతా పార్టీ పేరిట జంతర్‌మంతర్ వద్ద దేశాన్ని వ్యతిరేకించే వారంతా చేరారు. అక్కడ జరుగుతున్న ఆందోళనలో నీట్ బాధితులు ఒక్కరూ లేరు" అని అన్నారు.

# రెండో విడతలో కొత్తగా 7,897 మందికి బీటెక్ సీట్లు

హైదరాబాద్: ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్‌లో కొత్తగా 7,897 మంది విద్యార్థులు బీటెక్ సీట్లు పొందారు. రెండో విడత సీట్లను ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ బుధవారం రాత్రి కేటాయించింది. సీట్ల వివరాలను ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన గురువారం వెల్లడించారు. మొత్తం కన్వీనర్ కోటా కింద 176 కళాశాలల్లో 94,424 సీట్లు ఉండగా.. వాటిల్లో రెండో విడతతో కలుపుకొని 80,167 మంది సీట్లు సాధించారు. అంటే 84.90 శాతం సీట్లు భర్తీ కాగా.. ఇంకా 14,257 సీట్లు మిగిలిపోయాయి. కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత బ్రాంచీల్లో సీట్ల కేటాయింపు సంఖ్య కొంత తగ్గింది. గతేడాదితో పోల్చుకుంటే ఆ కోర్సులకు స్వల్పంగా డిమాండ్ తగ్గినట్లు స్పష్టమవుతోంది. కోర్ బ్రాంచీల్లో మెకానికల్‌లో మాత్రమే గతేడాది కంటే కొద్దిగా పెరిగారు. చివరకు ఎంత మంది చేరతారన్నది ఈ నెల 28 నాటికి స్పష్టత వస్తుంది.

*** విద్యార్థులు ఏం చేయాలంటే?...**

రెండో విడతలో సీట్లు పొందిన వారు వెబ్‌సైట్ నుంచి ఈ నెల 25లోపు ఫీజు చెల్లించి.. ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్ట్ చేసి.. 28వ తేదీలోపు కళాశాలల్లో స్వయంగా రిపోర్ట్ చేయాలి. ఒరిజినల్ టీసీతో పాటు ఇతర విద్యార్హతలకు సంబంధించి జిరాక్స్ పత్రాలను మాత్రమే కళాశాలల్లో అందజేయాలి. సీట్లు రద్దు చేసుకోవడానికి (ఆన్‌లైన్‌లోనే) 28వ తేదీ వరకు గడువు ఉంది. ఆలోపు రద్దు చేసుకుంటే చెల్లించిన మొత్తం ఫీజు తిరిగి ఇస్తారు. అలాగే విద్యార్థులకు ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో సీశాబ్ ద్వారా సీట్లు వస్తే ఫీజును తిరిగి చెల్లిస్తామని అధికారులు తెలిపారు.

# ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్2024' కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. "యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# వర్షాలు, వరదలతో అసోం విలవిల .. 41కి చేరిన మృతుల సంఖ్య

అసోంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర వినాశనాన్ని సృష్టిస్తున్నాయి. నదులన్నీ ఉగ్రరూపం దాల్చి ప్రమాద హెచ్చరిక స్థాయిలను దాటి ప్రవహిస్తుండటంతో రాష్ట్రంలో వరద పరిస్థితి అత్యంత విషమంగా మారింది. వేలాది మంది ఇళ్లను వదిలి దిక్కుతోచని స్థితిలో చిక్కుకుపోయారు. అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం... గడిచిన 24 గంటల్లోనే నలుగురు చిన్నారులతో సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో వరదల కారణంగా సంభవించిన మొత్తం మరణాల సంఖ్య 41కి చేరుకుంది. తాజా మరణాల్లో శివసాగర్ జిల్లాలో ముగ్గురు, జోర్హాట్‌లో ముగ్గురు, చరైడియో జిల్లాలో ఇద్దరు, ధేమాజీ, కర్బీ అంగ్లాంగ్ జిల్లాల్లో ఒకరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు మరో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు సహా మొత్తం ఆరుగురు వరద నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లోని 40 రెవెన్యూ సర్కిళ్ల పరిధిలోని దాదాపు 939 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. మొత్తం 6.53 లక్షలకు పైగా ప్రజలు ఈ వరదల దాటికి తీవ్రంగా ప్రభావితమయ్యారు. బ్రహ్మపుత్ర నదితో పాటు దాని ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. నంగ్లామురాఘాట్ వద్ద 'దిసాంగ్' నది తన ఆల్‌టైమ్ రికార్డు స్థాయి ప్రమాదకర మట్టాన్ని దాటి ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అలాగే బుర్హిదిహింగ్, దిఖౌ, ధన్సిరి, కుషియారా నదులు కూడా ప్రమాదకర హెచ్చరిక స్థాయిలను దాటి దిగువ ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. బాధిత జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 487 రిలీఫ్ క్యాంపులు, పంపిణీ కేంద్రాలలో దాదాపు 3.13 లక్షల మంది ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు 1.38 లక్షలకు పైగా మూగజీవాలు కూడా ఈ వరదల వల్ల ప్రభావితమయ్యాయి. ఇండియన్ ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, వాయుసేన, ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ బృందాలు రంగంలోకి దిగి ఒక్కరోజే 8,400 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. వరద ధాటికి 53 రోడ్లు, 6 కట్టలు పూర్తిగా ధ్వంసమై రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది.

# డీఆర్‌డీఓ మరో ఘనత..

## 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి (LRSAM) తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి. గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (UAV), శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది. 'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్‌శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్8, ఎస్400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది. 'కుశ' క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇది దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు.

# క్వాంటం పరిశోధనలకు అమరావతి బెస్ట్ ప్లేస్..

## క్వాంటినమ్ సీఈఓతో సీఎం భేటీ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ రంగంలో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబుతో అంతర్జాతీయ ఫుల్ స్టాక్ క్వాంటం కంప్యూటింగ్ సంస్థ 'క్వాంటినమ్' సీఈఓ రాజీబ్ హజ్రా, ఇతర ప్రతినిధులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. క్వాంటం పరిశోధనలకు, ఆవిష్కరణలకు అమరావతి అత్యుత్తమ ప్రదేశమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో భాగంగా అమరావతిలో 'క్వాంటం వ్యాలీ'ని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, ఇప్పటికే రాష్ట్రంలో క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. గతంలో ఐటీని ప్రోత్సహించామని, ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీలతో సమస్యలకు వేగంగా పరిష్కారాలు అందించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. జాతీయ క్వాంటం మిషన్‌కు అనుగుణంగా, ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు ఏపీతో వ్యూహాత్మక భాగస్వామ్యంపై క్వాంటినమ్ సంస్థ తీవ్ర ఆసక్తి వ్యక్తం చేసింది. క్వాంటం నైపుణ్యాభివృద్ధి, ఏఐ ఆధారిత క్వాంటం అప్లికేషన్లు, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రీసెర్చ్, స్టార్టప్ ఇంక్యుబేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఏపీలో క్వాంటం కంప్యూటర్ పరికరాల తయారీ నుంచి అల్గారిథమ్‌ల అభివృద్ధి వరకు పూర్తిస్థాయిలో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని క్వాంటినమ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో క్వాంటినమ్ సంస్థ ఉపాధ్యక్షుడు సీతారామకృష్ణ, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థే

హైదరాబాద్: గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో నిజాయతీ నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సవాల్ విసిరారు. "గత ప్రభుత్వ హయాంలో 2019లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఆ సంస్థ వ్యవహరించిన తీరుతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడింది వాస్తవం కాదా? ఆ సంస్థ కేటీఆర్ బినామీ. కేటీఆర్‌కు.. ఆ సంస్థకు.. జన్వాడకు సంబంధం లేదని భావిస్తే.. సీసీఎస్‌లో ఫిర్యాదు చేయాలి. ఎందుకంటే మేము విచారణ చేస్తే.. కక్ష సాధింపు అంటారు. కేటీఆరే ఫిర్యాదుచేస్తే.. అప్పుడు దాని లోతుపాతులు వెలికితీస్తాం. విచారణలో నిజాలు నిగ్గుతేలుస్తాం. రాష్ట్రంలో 2019లో జరిగిన ఇంటర్ పరీక్షల వ్యవహారం కేసుపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. నివేదిక వచ్చాక ఆ వివరాలు చెబుతా. గ్లోబరీనా వ్యవహారంలో అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ క్షమాపణ చెప్పాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభ ప్రాంగణంలోని మీడియా అడ్వైజరీ కమిటీ కార్యాలయంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా పలు అంశాలపై మాట్లాడారు.

*** నాకు రెండు ఓట్లున్నాయని తప్పుడు ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవు**

"రాష్ట్రంలో సర్ ఇప్పటికే 70 శాతం పూర్తయింది. బూత్ స్థాయిలో పార్టీ ఏజెంట్లను ఏర్పాటు చేసి.. నిజమైన ఓట్లు తొలగిపోకుండా పరిశీలిస్తున్నాం. ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశాలు ఉన్నందున పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో లక్షల ఓట్లు తొలగించారు. అప్పట్లో కాంగ్రెస్ కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికల సంఘం అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సుమారు 28 లక్షల ఆంధ్ర ప్రాంత ఓట్లు తొలగించగా.. అప్పటి కాంగ్రెస్ నేత మర్రి శశిధర్‌రెడ్డి పోరాటంతో సుమారు 15 లక్షల ఓట్లు తిరిగి జాబితాలోకి వచ్చాయి. ఓట్ల తొలగింపునకు మూల పురుషుడు కేసీఆరే. ఇప్పుడు కాంగ్రెస్ లక్ష్యంగా రాష్ట్రంలో సర్ జరుగుతోంది. కాంగ్రెస్ ఓటు బ్యాంకును దెబ్బతీసే లక్ష్యం ఉంది. దళితులు, గిరిజనులు, మైనారిటీల ఓట్లు పోయే అవకాశం ఉంది. అవి కాంగ్రెస్ ఓట్లు. వాటిని తొలగిస్తే కాంగ్రెస్‌కు నష్టం. నాకు రెండు ఓట్లు ఉన్నాయనే ఆరోపణలు చేస్తున్నవారు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలి. నేను ఇప్పటికే చట్టబద్ధంగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసి.. నా ఓటును బదిలీ చేయించుకున్నా. తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు" అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

*** భారాస అధికారంలో ఉన్నప్పుడు కాఫర్‌డ్యామ్ ఎందుకు కట్టలేదు?**

ఎన్డీఎస్ఏ సూచనలను ప్రభుత్వం పూర్తిగా అనుసరిస్తోంది. 5 మీటర్ల మేర నీళ్లు ఉండాలంటే.. మేడిగడ్డ గేట్లు దించాల్సిందే. కానీ కాళేశ్వరంలో గేట్లు ఎత్తి వేయాలని నిపుణులు స్పష్టం చేశారు. దానిగురించి హరీశ్‌రావు మాట్లాడడం లేదు. కూలిపోయిన మేడిగడ్డ గురించి మాట్లాడితే.. ప్రజలు ఎక్కడ ఆగ్రహిస్తారో అని.. కన్నెపల్లి పంప్‌హౌస్ గురించి మాట్లాడుతున్నారు.

# మెట్రో స్టేషన్ల బంద్.. లంచ్ టైంలోగా తేల్చండి

దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల నిరసనల కారణంగా పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం గురువారం సుప్రీంకోర్టుకు చేరింది. స్టేషన్ల మూసివేతతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీజేఐ, మధ్యాహ్న భోజన విరామ సమయానికి సమస్య పరిష్కారం కాకపోతే తానే స్వయంగా జోక్యం చేసుకుంటానని హామీ ఇచ్చారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే సోషల్ మీడియా వేదిక ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో గత కొన్ని రోజులుగా సెంట్రల్ ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేస్తున్నారు. ఇవాళ కూడా సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌తో సహా మొత్తం 16 స్టేషన్లలో సేవలను నిలిపివేశారు. ఈ అంశాన్ని సీజేఐ ముందు ప్రస్తావిస్తూ వికాస్ సింగ్ మాట్లాడారు. "సుప్రీంకోర్టు పరిసర ప్రాంతాల్లోని కీలక మెట్రో స్టేషన్లను మూసివేయడంతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సమయానికి కోర్టుకు చేరుకోలేకపోతున్నారు. సుప్రీంకోర్టుకు





సంబంధించిన సరైన గుర్తింపు కార్డులు ఉన్నవారిని, రిజిస్ట్రీ సిబ్బందిని సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌లో దిగేందుకు అనుమతించాలి. రైలు దిగిన తర్వాత ఎగ్జిట్ పాయింట్ వద్ద వారిని తనిఖీ చేసి బయటకు పంపవచ్చు" అని వికాస్ సింగ్ సూచించారు. ఈ ఆందోళనపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, ఈ విషయంపై మెట్రో అధికారులతో మాట్లాడాలని సుప్రీంకోర్టు యంత్రాంగాన్ని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. "ఒకవేళ మధ్యాహ్న భోజన సమయానికి మెట్రో స్టేషన్ తెరవకపోతే, నేనే స్వయంగా జోక్యం చేసుకుంటాను. ఈరోజు న్యాయవాదులు కోర్టుకు హాజరు కాలేకపోయిన కేసుల్లో ఎలాంటి ప్రతికూల ఉత్తర్వులు జారీ చేయవద్దని కూడా ఆదేశించాం" అని సీజేఐ భరోసా ఇచ్చారు. మరోవైపు తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు 16 మెట్రో స్టేషన్లు మూసి ఉంటాయని ఢిల్లీ మెట్రో ప్రకటించడంతో ప్రయాణికుల ఇబ్బందులు కొనసాగుతున్నాయి.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్ కు వినతి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇన్చార్జి అధ్యక్షులు మల్లారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఒబిసి మోర్చా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ లు గురువారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో ప్రజా సమస్యలపై ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి శేఖర్ యాదవ్ తీసుకెళ్లడం తో వారు వెంటనే స్పందించి జోనల్ కమిషనర్ కి లేఖ వ్రాశారు.ఆ యొక్క లేఖను జిల్లా అధ్యక్షులు ఒబిసి మోర్చా జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ కి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. దూలపల్లి ఎన్టీఆర్ స్టాచ్ నుండి జీడిమెట్లకు వెళ్లే రహదారి ఫేస్ పై సెకండ్ గేట్ వరకు నిత్యం వందలాది వెహికల్స్ రాకపోకలు సాగిస్తూ రోడ్డు పూర్తిగా ధ్వాసమైందున చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కావున వెంటనే రోడ్డు వేయాలన్నారు. దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కంపెనీలో లక్షల రూపాయలు టాక్స్ వసూలుచేసి కనీస సదుపాయాలు కంపెనీలకు కల్పిస్తలేరన్నారు. వెంటనే రోడ్లు డ్రైనేజీ వేయాలని వారన్నారు. జెడ్ సి సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఇంచార్జ్ నందనం దివాకర్ , నటరాజ్, శివాజీ రాజా, డివిజన్ అధ్యక్షులు కేశవ్ యాదవ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు

## తనపై భౌతిక దాడి చేశారని మాజీ సర్పంచ్ ఆరోపణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తనపై గ్రామానికి చెందిన పలువురు దాడి చేశారని మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. కొలను శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామపంచాయతీకి గత పర్యాయం తాను సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించానన్నారు. గురువారం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు వచ్చానని, గ్రామసభ ముగిసిన అనంతరం గ్రామానికి చెందిన సింగిరెడ్డి మహిపాల్ రెడ్డిపై కొంతమంది దూషణలు చేస్తూ దాడికి పూనుకున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్కడ జరుగుతున్న విషయాన్ని సెల్ ఫోన్ లో వీడియో చిత్రిస్తున్నానని పేర్కొన్నారు. వీడియో చితిస్తున్న తనపై 20మంది దుండగులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామ మాజీ సర్పంచ్ అయిన తనను దాడి నెపంతో చంపే కుట్ర చేశారని ఆరోపించారు. తనపై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన

- చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామం సినర్జీ పరిశ్రమలో మహిళల సంరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం ఉండాలని సూచించారు. మహిళల భద్రత, హక్కులు, స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాల నుంచి రక్షణ, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే వేగవంతం చేయాలి.. వరిపై ఆధారపడొద్దు

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ.



జనగామ, ప్రజాస్ఫూర్తి : భూముల రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరి ష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సందీ ప్ కుమార్ ఝూ అన్నారు. గురువారం మండలం లోని మరిగడి లో జరుగుతు న్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల లో రీ సర్వే పూర్త యింది ,ఇంకా ఎంత మేర పనులు మి గిలి ఉన్నాయో రెవెన్యూ, ల్యాండ్ అం డ్ సర్వే శాఖ అధికారులను అడిగి తె లుసుకున్నారు. భూ సమస్యలకు శాశ్వ త పరిష్కారం చూపించాలనే లక్ష్యం తో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ ముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టింద ని కలెక్టర్ తెలిపారు. గ్రామస్తులకు ఎ లాంటి ఇబ్బందులు కలగకుండా, పూర్తి పారదర్శకతతో నిర్ణీత గడువులోగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధి కారులను ఆదేశించారు. అనంతరం రై తులతో మాట్లాడిన కలెక్టర్, ప్రస్తుత వ ర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచు కుని పంటల సాగుపై ముందస్తు ప్రణాళి కతో నిర్ణయం తీసుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపీ రామ్, తహసీల్దార్, ల్యాండ్ అండ్ స ర్వే ఏడి తదితర అధికారులు పాల్గొన్నారు.

## తాగు సాగునీటిపై దృష్టి పెట్టండి

* ఎల్ నినో ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలి.
* మూడు జిల్లాల అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి: హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై మూడు జిల్లాల అధికారులతోమంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతటి విపత్కర పరిస్థితి ఏర్పడిన ఎదుర్కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు,ఇప్పటికే ఈ విపత్తు పై అన్ని జిల్లాల్లో ఇంచార్జి మంత్రుల ద్వారా సమీక్షలు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి డిపార్ట్మెంట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ చేసుకొని కోఆర్డినేట్ చేసుకోవాలన్నారు. సంక్షన్ అయి ప్రారంభం కాని పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో నియోజకవర్గంలో తాగునీరు అత్యంత అవసరం.ఇప్పుడున్న వర్షాభావ పరిస్థితుల్లో సాగు నీరు ఇచ్చే పరిస్థితి లేదని,ఏప్రిల్ నుండి వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ లు అధికారులు వరి వేయవద్దని అవగాహన కల్పించిన కొంత మంది రైతులు వరి వేస్తున్నారు.వరి వేయడం వల్ల నష్టపోతారు. వ్యవసాయంలో ఆరుతడి పంటలు వేయాలని,జలసిరి విబిజిరాంజీ పథకాల ద్వారా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఉండాలి. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఉండాలని అన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు.. అప్రజాస్వామికం

- చౌటుప్పల్ లో అంబేద్కర్ విగ్రహం నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ శ్రేణుల ధర్నా
- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ లు అన్నారు. ఏఐసిసి, టీపీసీసీల పిలుపుమేరకు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట మండల, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఢిల్లీ వేదికగా జంతర్ మంతర్ వద్ద నీట్ విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రశ్నాపత్రాల లీక్ విషయమై కేంద్ర ప్రభుత్వంపై ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులపై బిజెపి ప్రభుత్వం లాఠీ చార్జ్ ను పూర్తిగా ఖండించారు. ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ పీఎం మోదీ ఇంటి ముందు మెరుపు ధర్నాను భగ్నం చేయడం, రాహుల్ గాంధీని అరెస్టు చేయడం సరైనది కాదన్నారు. బిజెపి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన దశాబ్దం నుంచి 152పర్యాయాలు పరీక్షల పేపర్లు లీక్ చేసిందని, విద్య వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. దేశ భవిష్యత్తు, విద్యార్థుల శ్రేయస్సు కోసం బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ గోశిక వినయ్, నాయకులు చెన్నగొని అంజయ్య గౌడ్, వెలగా రాజశేఖర్ రెడ్డి, బొంగు జంగయ్య గౌడ్, గుండు మల్లయ్య గౌడ్, బక్క శ్రీనాథ్,, మాజీ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మొగుదాల రమేష్ గౌడ్, సుర్వి నర్సింహ్మ గౌడ్, సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్స్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, లావుడియ రాజు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఆరు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, లావుడియ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ముట్టడించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో గేటుకి వినతి పత్రం అందజేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా కాలయాపన చేసిందని ఆరోపించారు. ప్రజాపాలన ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థులకు చదువు దూరం చేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. జీవో నెంబర్ 7, 8, తీసుకువచ్చింది గతంలో వైయస్సార్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు తీసుకువచ్చిన స్కాలర్షిప్ పథకాన్ని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్రజేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం గుళ్లు గోపురాలకు, పెద్ద పెద్ద నగరాలకు కట్టడాలకు వేలకోట్ల ఖర్చులు చేస్తుందని, విద్యార్థులకు రావాల్సిందే స్కాలర్షిప్ విడుదల చేయడం లేదని ఆరోపించారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సభ్యురాలు ఇందు రాణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్ల రాహుల్, సహాయ కార్యదర్శిలు తీగుళ్ల శ్రీనివాస్, పుట్టల ఉదయ్, సృజన, జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్, ప్రసన్న, అరవింద్, నాయకులు సాయి, మల్లేశ్, సాయి, మధు, చరణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా, కురవి మండలం, కంచర్ల గూడెంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మిక పర్యటనలు చేశారు.గ్రామంలో కొనసాగుతున్న సర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ,ఆబాది రీసర్వే గ్రామకంఠం సర్వే,ఎస్జిటి ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు,అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ రికార్డులను పరిశీలించి జరుగుతున్న సర్వేపై సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత్ ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాలో ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని, క్షేత్రస్థాయిలో బిఎల్వో లు, ఎన్నికల విభాగం సిబ్బంది ప్రతి ఒక్కరికి ఎనమరేషన్ ఫార్మ్స్ పంపిణీ చేయడం జరిగిందని,అట్టి ఫారాలు పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందిస్తే ఆన్లైన్ డిజిటలైజేషన్ చేసి తమ ఓటును నిర్ధారణ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.గ్రామ,వార్డు, మండల, జిల్లా స్థాయిలలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు,(బిఎల్ఏ) లతో సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు, తద్వారా క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లు లేని ఓటరు జాబితా సిద్ధం అవుతుందని,అందుకోసం అధికారులు,పార్టీ ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయిలో ప్రత్యేక హెల్ప్ డెస్కులు, జిల్లాస్థాయి అధికారులను నియమించి అర్బన్ పరిధిలో పకడ్బందీగా ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు,జిల్లాలో రీ సర్వేకు ఎంపికైన (70) గ్రామాలలో (11) గ్రామాల గ్రామకంఠం, ఆబాది రీ సర్వే, పూర్తి చేయడం జరిగిందని ఈరోజు కంచర్ల గూడెం లో జరుగుతున్న సర్వే వివరాలను స్వయంగా పరిశీలించి అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డు శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వం సూచించిన ప్రకారం ఖచ్చితమైన సమాచారంతో క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు.విద్యాశాఖ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే ఎస్జిటి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సత్యనారాయణమూర్తి, డీఎస్ఓ అప్పారావు, ఎంఈఓ బాలాజీ, పాఠశాల హెచ్ఎం వాహిద్, ఆర్పీలు వెంకటేష్ శివప్రసాద్ శేఖర్ ఓంకార్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, స్థానిక తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

- దివీస్ సహకారంతో గ్రంథాలయం ప్రారంభం
- పంతంగి సర్పంచ్ బోయ కాకి శ్రీలత సుందర్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలని పంతంగి సర్పంచ్ బోయ కాకి శ్రీలత సుందర్ అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో దివిస్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించారు. దివీస్ పరిశ్రమ రూ.25,18,250లతో గ్రంథాలయ భవనం, ఫర్నిచర్, పుస్తకాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ బోయ కాకి శ్రీలత సుందర్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత సుందర్ మాట్లాడుతూ గ్రామంలోని యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు గ్రంథాలయం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు, యువత, మహిళలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన దివిస్ పరిశ్రమకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దివిస్ ప్రతినిధులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయ సదానందం, పంచాయతీ కార్యదర్శి పద్మజ, దివిస్ ప్రతినిధులు కిషోర్, గోపి, వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, స్కూల్ టీచర్స్, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, మహిళా సంఘం లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 25 వ వార్డు కౌన్సిలర్ నిరసనకు అధికారుల స్పందన



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్ బురదలో కూర్చొని నిరసన తెలుపగా వెంటనే మున్సిపల్ అధికారులు వార్డులో పర్యటించారు.వార్డు కమిటీ కన్వీనర్ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్రా శ్రావణ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందు ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ఎంతో అట్టహాసంగా పలు అభివృద్ధి పనులపై శంకుస్థాపనలు చేశారని కానీ నేటి వరకు కూడా అభివృద్ధి పనులు ప్రారంభానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఏఈ సౌజన్యను కోరగా సానుకూలంగా స్పందించిన మున్సిపల్ అధికారి ఏఈ సౌజన్య రెండు నుండి మూడు రోజుల గడువులో కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు చేయించడానికి ముందు కాంట్రాక్టర్ ను వార్డు కు పంపిస్తానని హామీ ఇచ్చారని తెలియచేశారు. లేనియెడలో రోడ్లు డ్రైన్లు వేసేంతవరకు దశలవారీగా పోరాటాలకు పూనుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ కాగితం శ్రీనివాస్, 25వ వార్డు సిపిఐ కమిటీ సభ్యులు మంద శంకర్,దారమల్ల మహేష్,మొలకలపల్లి సమ్మక్క,ఉపేంద్ర,అనూష, సులోచన,తండా శ్రీనాథ్, రాకేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను అణచివేసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులు, విద్యార్థులపై లాఠీచార్జ్ ను నిరసిస్తూ కేశంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేశంపేట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# త్రాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ఠ కార్యాచరణ





* **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : రాష్ట్రంలో నెలకొన్న 'ఎల్ నినో' తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొకుండా పటిష్ఠ కార్యాచరణ చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ దిశగా ప్రజా ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేసింది. జిల్లావాసులకు ఎలాంటి తాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని గత సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు యంత్రాంగం వేగంగా స్పందించి చర్యలు చేపట్టింది.

**వేగంగా నీటి తరలింపు**

భద్రాచలం వద్ద ఉన్న దుమ్ముగూడెం నుంచి రాజీవ్ కాలువ ద్వారా గోదావరి వెనుక జలాలను నాగార్జునసాగర్ (ఎన్ఎస్పీ) మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా నేరుగా వైరా చెరువుకు తరలిస్తున్నారు.

* **క్షేత్రస్థాయిలో డిప్యూటీ సీఎం పరిశీలన**

గురువారం నాడు ఎన్ఎస్పీ మెయిన్ బ్రాంచ్ కాలువకు వేగంగా వస్తున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని, తరలింపు ప్రక్రియను సమీక్షించిన ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులను ఈ గోదావరి జలాలతో త్వరితగతిన నింపాలని ఆదేశించారు. నీటి ఎద్దడికి తావులేకుండా జాగ్రత్తలు ఎల్ నినో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఊరట ఎల్ నినో ముప్పు పొంచి ఉన్న వేళ, సాగర్ మెయిన్ బ్రాంచ్ ద్వారా గోదావరి జలాలు వైరా చెరువుకు చేరుతుండటంతో ఖమ్మం జిల్లా ప్రజలకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఇరిగేషన్ సిఇ శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాస చారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టికి మొక్కను అందజేసిన నైనిక రజువా



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా పర్యటనలో భాగంగా గురువారం కొత్తగూడెం పట్టణం రామవరం ప్రాంతంలోని టిపిసిసి జనరల్ సెక్రెటరీ మోతుకూరి ధర్మారావు నివాసానికి వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గనుల శాఖా మంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా మొక్కను అందించి హరిత సందేశాన్ని ఇచ్చింది. ఈ సందర్భంగా నైనికను భట్టి అభినందించి ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని సూచించారు. అనంతరం నైనిక రజువా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. తొలుత మోతుకూరి ధర్మారావు, ఆయన సతీమణి లక్ష్మిలు భట్టికి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతుకూరి లక్ష్మి, ఝాన్సీ రాణి, కుసుమ శ్రీనివాసరావు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం, ఒకరి పట్టివేత



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : చిట్యాలలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని జిల్లా సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు దాడి నిర్వహించారు. చిట్యాల మండలం మునినిపర్తి గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి గౌరిశెట్టి సత్యనారాయణ (48) అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించి అతడిని పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న సుమారు 6 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితో పాటు బియ్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలను కోరారు.

## ఆభరణాల కొనుగోలుదారులకు మలబార్ గోల్డ్ & డైమండ్స్ 'ఆభరణ శుభలాభ్' ఆఫర్

కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : మలబార్ గోల్డ్ & డైమండ్స్ తెలంగాణ వ్యాప్తంగా 'ఆభరణ శుభలాభ్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్‌లో బంగారం, అన్‌కట్, ఇతర ఎంపిక చేసిన ఆభరణాల మేకింగ్ చార్జీలపై 30 శాతం వరకు తగ్గింపు, డైమండ్ ఆభరణాలపై 30 శాతం వరకు రాయితీ, అలాగే డైమండ్ నగల ఎక్స్చేంజ్‌పై జీరో డిడక్షన్ సదుపాయం అందిస్తోంది. ఈ ప్రత్యేక ఆఫర్లు జూలై 15 నుంచి ఆగస్టు 12, 2026 వరకు తెలంగాణలోని మలబార్ గోల్డ్ & డైమండ్స్ అన్ని షోరూమ్‌లలో అందుబాటులో ఉంటాయి. నాణ్యమైన ఆభరణాలను ఆకర్షణీయమైన ధరల్లో వినియోగదారులకు అందించడమే ఈ ప్రచారం లక్ష్యమని సంస్థ తెలిపింది.

## ప్రమాదాల బ్లాక్ స్పాట్ల పై సీపీ ప్రత్యేక దృష్టి

* **నివారణ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశం.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ జిల్లా లో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లపై పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం సంబంధిత పోలీసు అధికారులు, నేషనల్ హైవే అథారిటీ, రోడ్డు రవాణా, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి జాతీయ రహదా రి-163 (హనుమకొండ-హైదరాబాద్) మార్గంలోని కరుణాపురం నుంచి పెంబ ర్తి వరకు ప్రమాదాలకు గురయ్యే 10కి పైగా బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ఈ సందర్భంగా ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను సమగ్రంగా ప రిశీలించిన సీపీ, నివారణ చర్యలపై అధికారులతో చర్చించారు. గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓ పెనింగ్‌ల వద్ద రాత్రివేళల్లో తగిన లైటిం గ్ ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, దిశా నిర్దేశక సూచికలు, రి ఫ్లెక్టివ్ సైన్ బోర్డులను ఏర్పాటు చేయా లని ఆదేశించారు. జాతీయ రహదారి వెంట ఉన్న మద్యం దుకాణాల వద్ద వా హనాల రాకపోకలకు అంతరాయం కల గకుండా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు చర్య లు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడి స మస్యలను తెలుసుకున్న సీపీకి, కరుణాపురం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల ని స్థానికులు విజ్ఞప్తి చేయగా, అవసరమైన ప్రాంతాల్లో పాదచారుల వంతెనల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులకు సూచిం చారు. అనంతరం జాతీయ రహదారిపై ప్రమాద బాధితులను తరలించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను పరిశీలించిన సీపీ, అత్యవసర వైద్య సౌకర్యా లు, సిబ్బంది స్పందన తీరుపై ఆరా తీసి, మరింత సమర్థవంతంగా సేవలు అం దించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నా యక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవనం నిర్మించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామ పెద్దల విజ్ఞప్తి



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కిషన్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు భయాందోళనల మధ్య చదువులు కొనసాగిస్తున్నారని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల భవనం దుస్థితిపై తక్షణమే స్పందించి నూతన భవనం నిర్మించాలని కోరుతూ పెద్ద ఎత్తున గ్రామస్తులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ శిథిలమైన భవనంలో విద్యార్థులు ప్రతిరోజూ బిక్కుబిక్కుమంటూ చదువుకోవాల్సి వస్తోందని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలాగైనా నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. ఇప్పటికైనా పాఠశాల భవన నిర్మాణం లేదా మరమ్మతులకు చర్యలు తీసుకుని విద్యార్థులకు భద్రమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ.. పాఠశాల భవనం సమస్యను ప్రభుత్వం దృష్టికి తప్పకుండా తీసుకెళ్లి, విద్యార్థులకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్ల నర్సమ్మ నరసింహులు, ఉప సర్పంచ్ ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కట్ట వెంకటేష్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి శ్రీనివాస్, మిద్దెల మల్లారెడ్డి, చిలకమర్రి రాములమ్మ, చించేటి శ్రీనివాస్ గౌడ్, వడ్ల కాశీనాథ్, హరిశంకర్ యాదవ్, దాసరి యాదగిరి, మిద్దెల విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై కేసముద్రంలో కాంగ్రెస్ పార్టీ ధర్నా

* **ప్రశ్నించే గొంతులను నొక్కుతున్న కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్యే డా" మురళీ నాయక్**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేసముద్రం మున్సిపాలిటీ అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నీట్ పేపర్ లీకేజీ ఘటనకు ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మానుకోట ఎమ్మెల్యే డా" మురళీ నాయక్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని తీవ్రంగా విమర్శించారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో వరుసగా జరుగుతున్న అవకతవకలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని అన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వంటి ఘటనలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని 48, 17వ వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నిజమైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, అవసరమైన పత్రాలతో ప్రజలు ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 75 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే ఫారాలు నింపించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, 48వ వార్డు కౌన్సిలర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, 17వ వార్డు కౌన్సిలర్ బైరబోయిన శ్రీదేవి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జ్యోతి కరుణాకర్, పాలగాని కృష్ణ, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్, దండ అరవింద్ రెడ్డి, పిల్లల రమేష్‌నాయుడు, ధర్మ నాయక్, ప్రవీణ్ కుమార్, వార్డు ఆఫీసర్ నాగార్జున, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ లో ప్రతిరోజు శుభ్రత చర్యలు చేపట్టాలి

* **జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: వసతి గృహంలో విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాస్టల్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం చిన్న శంకరంపేట మండల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాన్ని ఆకస్మింగ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంటగది, స్టోర్ రూమ్ పరిశీలించి ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రతను తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ ఆవరణ, డ్రైనేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, ఇతర వసతులను పరిశీలించారు. హాస్టల్ విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలు వార్డెన్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా హాస్టల్లో ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని, మరుగుదొడ్లు, హాస్టల్ గదులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు మొక్కలు క్రమ పద్ధతిలో పెంచాలని తెలిపారు. ప్రభుత్వంచే మంజూరైన ఇంటిగ్రేటెడ్ నిధులను వాడుకొని సౌకర్యాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహంలో సరిపడా వెలుతురు ఉండేలా ట్యూబ్ లైట్లు మరికొన్ని అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## హాకా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ నందు ఆర్టీసీ పెట్రోల్ పంప్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన హాకా రైతు సేవ కేంద్రంను మహబూబాబాద్ ఎమ్మెల్యే డా" భూక్యా మురళీ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా"మురళీ నాయక్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ సలహాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా రైతు సేవా కేంద్రాలు పనిచేయడం అభినందనీయమని అన్నారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, హాకా రైతు సేవా కేంద్రం నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్, 27వ వార్డు కౌన్సిలర్ నిమ్మల మాధవి శ్రీనివాస్, 2వ వార్డు కౌన్సిలర్ అంబాల శివకుమార్, 14వ వార్డు కౌన్సిలర్ గాడిపల్లి నాగేశ్వర్ రావు, 22 వ వార్డు కౌన్సిలర్ పద్మం ధనలక్ష్మి ప్రవీణ్, 31వ వార్డు కౌన్సిలర్ పుచ్చకాయల సరిత కృష్ణ, 28 వ వార్డు కౌన్సిలర్ బొల్లు రాజు, తోట సుభాష్, ఎడ్ల రమేష్, రమేష్, చందర్ రెడ్డి, దేవరం ప్రకాష్ రెడ్డి, గోనె శ్యామ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు స్వాగతం పలికిన పేగడ బిక్షపతి



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం: చుంచుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పేగడ బిక్షపతి ఆధ్వర్యంలో సింగరేణి పర్యటనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు , వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు ఆయన స్వాగతం పలికారు . ఈ సందర్భంగా పేగడ బిక్షపతి పలు సింగరేణి సమస్యలు , పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని భట్టి కు వినతిపత్రం అందజేశారు . అనంతరం ఆయన వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## వర్షాలు కురవాలని వనభోజనాలతో ప్రత్యేక ప్రార్థనలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ గ్రామ శివారులో ముస్లిం సోదరులు వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాహ్‌ను ప్రార్థిస్తూ గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, వ్యవసాయానికి అనుకూలంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక దువాలు చేశారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ, "ప్రకృతి అనుగ్రహంతోనే రైతు బాగుపడతాడు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండాలని, ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాం. గ్రామంలో అన్ని మతాల ప్రజలు ఐకమత్యంతో కలిసి జీవించడం సంతోషకరమైన విషయం.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు అడ్డుకట్ట

*** జిల్లా వైద్యాధికారి రాహుల్**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : మహిళల్లో అధికంగా కనిపిస్తున్న క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ ఒక ప్రధాన ఆరోగ్య సమస్య. ఈ వ్యాధిని సమర్థవంతంగా నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం హ్యూమన్ పాపిలోమా వైరస్ హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాహుల్ మాట్లాడుతూ కౌమార దశలో, ముఖ్యంగా 14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ వ్యాక్సిన్ సురక్షితమైనదని, ప్రభావవంతమైనదని, దీర్ఘకాలిక రక్షణను అందిస్తుందని పేర్కొన్నారు.ముఖ్యంగా 8వ, 9వ, 10వ తరగతుల్లో చదువుతున్న అర్హత కలిగిన బాలికలు ఈ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా పొందేలా చూడాలని విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులను ఆయన కోరారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌కు రూ.10,000కు పైగా ఖర్చు అవుతుండగా, ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచిందని తెలిపారు.అర్హులైన ప్రతి బాలిక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్మూలనకు ప్రతి కుటుంబం సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాహుల్ పిలుపునిచ్చారు.

# హుస్నాబాద్ లో మంత్రి పొన్నం వరుణయాగం

*** సమృద్ధిగా వర్షా లు కురవాలని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు,సుఖశాంతులతో జీవించాలని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుస్నాబాద్ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హుస్నాబాద్ అయ్యప్ప ఆలయంలో 108 మంది రుత్వికులతో, 21 హోమగుండాలతో నిర్వహించిన శ్రీ వారాహి మూల మంత్ర హోమ మహాయజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి, 108 కలశాలతో మరకత శివాలయంలో నిర్వహించిన వరుణ యాగంలో పాల్గొని రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రైతాంగం ఆందోళన చెందుతోందన్నారు. అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయం పుంజుకోవాలని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# దోస్తు ప్రవేశాలకు ఇదే చివరి అవకాశం!

*** విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : రెగ్యులర్ డిగ్రీ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఇదే చివరి అవకాశం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూపాలపల్లి ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ కాలేజీ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కళాశాలలో దోస్తు స్పెషల్ ఫేజ్ ప్రవేశాలు కొనసాగుతున్నా యని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూపాలపల్లిలో బీఏ (సీబీఎస్సీ ), బీకాం (సీఎ, బీఎఫ్ఎస్ఐ), బీఎస్సీ (బీజెడ్సీ, బీజెడ్సీఎస్, ఎంపీసీ, ఎంపీసీఎస్) కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. డిగ్రీలో చేరి ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని ఏమాత్రం వదులుకోకుండా దోస్తు స్పెషల్ ఫేజ్ ద్వారా అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు కోరారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

*** కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ జడల రాజేశ్వరి, పోతుల పవన్, ఉల్లేరావు బన్నీ, రాజుల శివ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# రోజుకో పోలీస్‌స్టేషన్.. ప్రజల సమస్యలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

*** పిల్లలు, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు**

*** ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తీరుపై ప్రజల ప్రశంసలు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడంతో పాటు.. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడుతూ నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ.. రోజుకో పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా తెలుసుకుంటున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, నిబంధనల ప్రకారం వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచిస్తున్నారు. ప్రజలతో మర్యాదగా, స్నేహపూర్వకంగా మెలుగుతూ.. పోలీస్‌శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని ఆదేశిస్తున్నారు.

*** క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌పై నిఘా**

పోలీస్‌స్టేషన్ల ఆకస్మిక తనిఖీల్లో భాగంగా రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను ఎస్పీ స్వయంగా పరిశీలిస్తున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు.. బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో జిల్లాలోని పోలీసు సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించేలా ఎస్పీ తనిఖీలు దోహదపడుతున్నాయి.తనిఖీ చేసిన ప్రతీ స్టేషన్ లో మొక్కలు నాటుతూ,సిబ్బంది కి సూచనలు ఇస్తూ... పర్యావరణంపై తన ప్రేమను చాటుకుంటున్నారు.

*** గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు యువతను, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులను గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ఎస్పీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా పెంచడంతో పాటు.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశిస్తున్నారు.

*** ప్రజాప్రతినిధులు.. ప్రజల భాగస్వామ్యంతోనే నిర్మూలన**

గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలన కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని.. ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎస్పీ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ప్రజాప్రతినిధి, ప్రజా సంఘాలు, యువజన సంఘాలు, విద్యాసంస్థల నిర్వాహకులు తమ వంతు బాధ్యతగా తీసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిస్తున్నారు. గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు, మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచిస్తున్నారు.

**పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా..**

గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా పిల్లలు, విద్యార్థులను రక్షించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచిస్తున్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాలని.. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై చిన్న వయస్సు నుంచే అవగాహన కల్పించాలని చెబుతున్నారు. పోలీసులతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేస్తేనే గంజాయి రహిత సమాజాన్ని నిర్మించగలమని ఎస్పీ స్పష్టం చేస్తున్నారు.

*** ప్రజల మన్ననలు పొందుతున్న ఎస్పీ**

రోజుకో పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తూ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకోవడం, ప్రజల సమస్యల పరిష్కారానికి సిబ్బందికి సూచనలు చేయడం, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడం, గంజాయి నిర్మూలనకు ప్రజలను భాగస్వాములను చేయడం వంటి చర్యలతో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రజల భద్రత.. యువత భవిష్యత్తు.. నేర రహిత సమాజమే లక్ష్యంగా పోలీస్‌శాఖను ప్రజలకు మరింత చేరువ చేస్తూ ఎస్పీ చేస్తున్న నిరంతర పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు భూపాలపల్లి జిల్లాలో ప్రజా పోలీసింగ్‌కు కొత్త ఊపునిస్తున్నాయి.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా వదిలేదేలే

*** షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**




షాద్ నగర్ పట్టణ కూడలిలో విద్యార్థుల ధర్నాకు వీర్లపల్లి మద్దతు ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : దేవుడి అక్షింతలను ఇంటింటికి ఇచ్చి అధికారంలోకి వచ్చారు.. కానీ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు.. ఇదొక్కటి దారుణం.. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమా.. మోదీ ఖబర్దార్.. బిజెపి ఖబర్దార్.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరిక చేశారు.షాద్ నగర్ పట్టణ కూడలిలో నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు ఆయన మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలు బలి అయ్యాయని, 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, అయినా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు అండగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తుంటే విద్యార్థులపై లాఠీలు విసరడమే కాకుండా, రాహుల్ గాంధీని కూడా గాయపరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో చర్చించేందుకు రాహుల్ గాంధీ సిద్ధంగా ఉన్న ప్రభుత్వం ముందుకు రావడంలేదని అన్నారు. ఇప్పటిదాకా గాంధేయ మార్గంలోనే ఆందోళన చేశామని, ప్రభుత్వం దిగి రాకుంటే పార్లమెంటును ముట్టడించడానికి కూడా తాము సిద్ధమే అని అన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోదీ ఒక అసమర్థ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఉన్న ఏ దేశంలో ప్రజాస్వామ్య విరుద్ధంగా ఇలా ప్రభుత్వాన్ని కొనసాగించడం దారుణమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తే ప్రతిపక్షాలు చూస్తూ ఊరుకోమని, పోరాటమే మార్గంగా ముందుకు సాగుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వవేశర్,పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,గిరిజన ఆదివాసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్, చెంది తిరుపతి రెడ్డి,మహ్మద్ ఇబ్రహీం, వివిధ మండల పార్టీ అధ్యక్షుడు లు, ప్రతినిధులు,విద్యార్థులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దు

*** బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై గురువారం కుత్బుల్లాపూర్ జోన్ ఇంజనీరింగ్ శాఖా ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పేట్ బషీరాబాదు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణం, విద్యుత్ సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు.కుత్బుల్లాపూర్ నియోజక వర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేట ప్రజల దాహార్తిని తీర్చేందుకు

# త్వరలో దోసపాడు ప్రాజెక్టు పునఃప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శవంతమైన, నంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 24వ వార్డు సీతారాంపురం ప్రాంతంలో మున్సిపల్ సాధారణ నిధుల ద్వారా మంజూరైన 5 లక్షలతో మురికి కాలువ (డ్రైనేజీ) నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని శివారు ప్రాంతాలతో పాటు అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. రానున్న వేసవికాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు దోసపాడు ప్రాజెక్టును పునరుద్ధరించి, సూర్యాపేట ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఇ ప్రణయ్ రెడ్డి, ఎ ఇ వరుణ్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గంజా నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక చర్యలు

*** గంజా నిందితుల ఇళ్లలో సీసీఎస్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: జిల్లాలో గంజా నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం సీసీఎస్ పోలీసులు నార్కోటిక్ డాగ్ సహాయంతో భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్, కాకతీయ కాలనీ, జంగేడు, ఖాసింపల్లి ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గతంలో గంజా కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు, గంజా వినియోగదారుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజా నిందితులు, వినియోగదారులు, వారి కుటుంబ సభ్యులతో పోలీసులు మాట్లాడారు. గంజా విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజా వినియోగం, సంబంధిత నేరాలపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎవరైనా గంజా సేవిస్తున్నట్లు లేదా గంజా సంబంధిత కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని సీసీఎస్ పోలీసులు తెలిపారు. గంజా విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నార్కోటిక్ డాగ్‌ల సహాయంతో ప్రత్యేక తనిఖీలు, నిరంతర నిఘా, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ గంజా నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

# రూ.1.96 లక్షల విలువైన గుట్కా స్వాధీనం

*** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలపై భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని చాముండా జనరల్ స్టోర్స్, దుర్గా జనరల్ స్టోర్స్, పవన కృష్ణ కిరాణం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో అంబర్, ఆర్ఆర్, అనార్, జేకే, మీరాజ్ తదితర నిషేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం రూ.1,96,430 విలువైన గుట్కా, పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సరుకును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి హానికరమైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ చేయడం, విక్రయించడం, రవాణా చేయడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# జిల్లా వ్యాప్తంగా నాకాబందీ... విస్తృత తనిఖీలు




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గురువారం ఏకకాలంలో ప్రత్యేక నాకాబందీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ప్రతిష్టమైన ప్రణాళికతో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, పాత నేరస్తులను కనుగొనడానికి ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు చేపట్టారు. ఈ ప్రత్యేక తనిఖీలలో మొత్తం 3714 వాహనాలను తనిఖీ చేయగా, వీటిలో 2384 ద్విచక్ర వాహనాలు, 987 నాలుగు చక్రాల వాహనాలు, 434 లారీలు ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 510 మంది, నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన, నంబర్ ప్లేట్ లేని 308 వాహనాలు, హెల్మెట్ ధరించని 524 మంది, సీటు బెల్ట్ ధరించని 106 మంది, మైనర్లు నడిపిన 14 వాహనాలు, అక్రమంగా సైలెన్సర్ మార్పులు చేసిన 4 వాహనాలను గుర్తించినట్లు వివరించారు. 7 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి, 15 అనుమతి లేని వాహనాలను స్వాధీనం చేసుకోగా, తనిఖీల్లో చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని సైతం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తోనే వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 27, 28 తేదీల్లో రెజ్లింగ్ స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం నందు ఈనెల 27, 28 తేదీలలో రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ నందు రెజ్లింగ్ హాస్టల్‌లో బాలుర ప్రవేశాలకు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలోఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. కాశీహుస్సేన్ తెలిపారు. 14 నుండి 16 ఏళ్ల లోపు బాలురు ఈ ఎంపిక పోటీలకు అర్హులని, ఆసక్తి ఉన్న వారు బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, 10తరగతి మెమో, ఒరిజినల్ ఆధార్ కార్డ్, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన రెజ్లింగ్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రెజ్లింగ్ హాస్టల్‌లో చేరడం ద్వారా మరింత ప్రతిభవంతులుగా రాణించవచ్చునని కాశీ హుస్సేన్ పేర్కొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : రేగొండ మండలంలోని దమ్మన్నపేట, రాయపల్లి, తిరుమలగిరి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గీయ మంచిక రాజయ్య, రాయపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ. అమృత రెడ్డి, తిరుమలగిరి గ్రామానికి చెందిన స్వర్గీయ కూతురు లక్ష్మీ, అదే గ్రామానికి చెందిన స్వర్గీయ. కాదాసి సుగుణమ్మ కుటుంబాలను గురువారం ఆయన స్వయంగా వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. అనంతరం మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

# చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ.. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

# నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

*** ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన సిపిఐ నేతలు**





మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థులపై హింసకాండను నిరసిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అందుకు బాధ్యత నరేంద్ర మోడీ వహించాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందట నిరసన ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం విద్యార్థులపై చేస్తున్న లాఠీచార్జ్ హింసకాండను ఆపాలని వెంటనే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా దేశ రాజధానిలో విద్యార్థులపై ధమనకాండ జరుగుతున్న ప్రేక్షక పాత్ర వహిస్తున్న నరేంద్ర మోడీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు సిపిఐ నేతలకు గలాటా కాగా ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దగ్ధం చేయకుండా ఆపిన పోలీసులు గలాటా జరిగిన కూడా సిపిఐ నేతలు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగ చారి, తండ సందీప్, నర్రా శ్రావణ్, వెలుగు శ్రవణ్, మేక వీరన్న, బానోతు లింగ్య నాయక్, మాలోత్ రవీందర్, కేదాసు రమేష్, పాల్, చిరంజీవి, ఎండి మహమూద్, ఆబోతు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి వేగానికి ఆధునిక సాంకేతికత కీలకం

*** కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించినప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం టీ ఫైబర్ ద్వారా నిర్వహించిన 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేటివ్ ఎఫిషియన్సీ' ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏఐ ఆధారిత సాధనాల వినియోగం, ఫైళ్ల నిర్వహణ, నివేదికల తయారీ, డేటా విశ్లేషణ, సమయాన్ని ఆదా చేసే విధానాలు, ప్రజా సేవల్లో సాంకేతికత పాత్ర తదితర అంశాలపై నిపుణులు అవగాహనకల్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధుల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ)ను సమర్థంగా వినియోగించేందుకు అధికారులు, సిబ్బందికి శిక్షణ అవసరమన్నారు. 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్య సాధనలో జిల్లాల అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. చాట్‌జీపీటీ, క్లాడ్ వంటి ఏఐ సాధనాలను పలువురు అధికారులు వినియోగిస్తున్నారని, అయితే వాటిపై పూర్తిగా ఆధారపడకుండా జాగ్రత్తగా ఉపయోగించాలని సూచించారు. ఏఐ పనులను సులభతరం చేసి, జ్ఞానాన్ని పెంపొందించే సాధనమే తప్ప తుది నిర్ణయం అధికారులదేనని స్పష్టం చేశారు. ఏఐ ద్వారా లభించే సమాచారం, సూచనలను ధ్రువీకరించిన తర్వాతే వినియోగించాలని సూచించారు. అనంతరం జిల్లా పరిపాలనలో వినియోగిస్తున్న ఏఐ సాధనాలను అధికారులకు ప్రాక్టికల్‌గా ప్రదర్శించి, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఏఐ నిపుణులు ధీరజ్, రాహుల్, ఈడీఎం శ్రీకాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల పేరుతో కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోంది

*** బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోరే రవీందర్‌రెడ్డి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీ నిరసనలు చేపడుతోందని బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు మోరే రవీందర్‌రెడ్డి ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని విమర్శించారు. గురువారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు మోరే వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరియాదవ్ మాట్లాడారు. తెలంగాణలో విద్యార్థుల సమస్యలపై స్పందించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు.. ఇప్పుడు విద్యార్థుల పేరుతో నిరసనలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పోతుగల్లు సర్పంచి ఎలిగేటి తిరుపతి, జిల్లా నాయకులు బండారి రవీందర్, పోతుగంటి సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి అరికాంతపు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు తెప్ప రాజు, రాస బిక్షపతి, మండల నాయకులు బోయిని తిరుపతి, బూత్ అధ్యక్షుడు పొడిసెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

# మౌళిక సౌకర్యాలు కల్పించే బాధ్యత జిల్లా అధికారులకు లేదా

*** సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా కేంద్రంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సమస్యలు పరిష్కారం చేయాలని సిపిఎం మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించి, ఆర్ ఎం ఓ డాక్టర్ మణికంఠ కి వినతిపత్రం అందజేశారు. ధర్నాను ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో ఉన్న రెండు ప్రభుత్వ ఆసుపత్రులలో మౌళిక సౌకర్యాలు లేవన్నారు. పేషంట్లకు, వారి సహాయకులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. రోగుల సహాయకుల కోసం వేసిన షెడ్ రేకులు ఉడిపోయినయని వాటికి ఎందుకు మరమ్మత్తులు చేయడం లేదని అన్నారు. సమస్యలపై జిల్లా కలెక్టర్ కి రెండు సార్లు వినతి పత్రం అందచేసిన సమస్యలపై ఎందుకు స్పందించలేదని అన్నారు. హాస్పిటల్ కు వచ్చే పేదలకు సౌకర్యాలు కల్పించడం జిల్లా కలెక్టర్ బాధ్యత కదా అని ప్రశ్నించారు. పార్కింగ్ సౌకర్యం లేక వాహనాలు అన్ని రోడ్ పైననే పెడుతున్నారని అన్నారు.. పేషంట్ వెంట వచ్చిన సహాయకులకు కనీసం ఉండడానికి విశ్రాంతి రూము ఉన్నపటికీ రేకులు ఉడిపోవడంతో కోతుల బెండదాతో తెచ్చుకున్న దుప్పట్లు, సామాగ్రి ఎక్కడ పెట్టాలో అర్థం కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేసారు. కనీసం మరుగుదోడ్లు, మూత్ర శాలలు, స్నానపు గదుల శుభ్రత పాటించకపోవడం సిగ్గుచేట్టన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే హాస్పిటల్ ను సందర్శించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం చేయకుంటే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

*** సమస్యలు పరిష్కారం చేస్తామనీ ఆర్ఎంఓ హామీ**

హాస్పటల్లో ఉన్న సమస్యలు వారం రోజుల్లో పరిష్కారం చేస్తామని ఎం సి హెచ్ హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ మణికంఠ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.మల్లేశం, కె. మల్లేశం, బాలమణి, కార్యవర్గ సభ్యులు కడారి నాగరాజు, సంతోష్, నాయకులు అజెయ్, షౌకత్, దుర్గ, వెంకటేష్, రాకేష్, భరత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాత కొత్తగూడెం పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

*** సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం లో గల ప్రభుత్వ ప్రాథమిక , హైస్కూల్ లో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ఎంఈఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలని, పాఠశాల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రత కల్పించాలని , టాయిలెట్స్ లను మరమ్మత్తులు చేయటంతో పాటు ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచాలని , ప్రహరీ గోడ లేకపోవడం వలన అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జునుమాల నగేష్, నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు ,బాల కృష్ణ , ముత్తేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేకలను కోల్పోయిన కుటుంబానికి రూ.20 వేల సహాయం



సిద్దిపేట, ప్రజాస్ఫూర్తి : కుక్కల దాడిలో మేకలను కోల్పోయిన కుటుంబానికి వంగ రాజేశ్వర్ రెడ్డి అండగా నిలిచారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన గాంతి శ్రీను మేకలపై కుక్కలు దాడి చేయడం తో సుమారు 40కు పైగా మేకలను మృతి చెందాయి. విషాద ఘటనను తెలుసుకున్న వెంటనే వంగ రాజేశ్వర్ రెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మేకల మృతితో తీవ్ర ఆర్థిక నష్టం ఎదుర్కొంటున్న కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.20,000 ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన ఆయన, ఇలాంటి క్లిష్ట సమయంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వంగ రాజేశ్వర్ రెడ్డి కోరారు.

# రవీంద్రసూరికి సినారె సాహితీ పురస్కారం



సూర్యా పేట , ప్రజాస్ఫూర్తి : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన కవి, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరికి 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి (సినారె) స్మారక సాహితీ పురస్కారం ప్రకటించారు. మహాకవి సినారె 95వ జయంతిని పురస్కరించుకొని సినారె కళాపీఠం, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఆగస్టు 2న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు వెల్లడించారు.ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి తనను ఎంపిక చేసిన ఎంపిక కమిటీ సభ్యులకు, సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు గారికి రవీంద్రసూరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని తన వ్యక్తిగత విజయంగా కాకుండా సాహిత్యానికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ర్యాలీ



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా కేంద్రంలోని ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశార.కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఢిల్లీలో ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ పై జరిగిన దాడి దేశ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని విమర్శించారు* ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ జడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనుప రెడ్డి, ఆర్టిఏ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసాని వేణుగోపాల్ రెడ్డి, మారగోని నవీన్ గౌడ్, అల్లి సుభాష్ యాదవ్, ఖయ్యూం బేగ్, ఇబ్రహీం,గుండబోయిన వెంకన్న యాదవ్, ఖలీల్, సమద్, వజ్జ రమేష్ యాదవ్, ఇర్ఫాన్, మామిడి కార్తీక్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, దుబ్బ అశోక్ సుందర్,కరుణాకర్ రెడ్డి, చిన్నాల జానయ్య, ప్రదీప్ నాయక్, సంకు ధనలక్ష్మి, కత్తుల కోటి, ఇబ్రహీం,పాదం అనిల్ కుమార్, వెంకన్న గౌడ్, ముజ్జు, కంచర్లకుంట్ల వెంకటరెడ్డి, పిల్లి రమేష్ యాదవ్, పెరికే, అంజయ్య తో పాటు పలువురు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం.. సహించం

* మోవాడ్‌లో పీహెచ్‌సీ, ఆశ్రమ పాఠశాలపై కలెక్టర్ హరిత ఆకస్మిక తనిఖీ
* రికార్డులు సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం.. సిబ్బందికి గైర్హాజరు నమోదు



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. హరిత హెచ్చరించారు. గురువారం ఆసిఫాబాద్ మండలం మోవాడ్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, రికార్డుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపించడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లు ఖాళీగా ఉండటంతో పాటు మందుల వివరాలు నమోదు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. గత పది రోజులుగా సిబ్బంది హాజరు నమోదు చేయకపోవడంతో సంబంధిత సిబ్బందికి గైర్హాజరు నమోదు చేస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, 58 మంది విద్యార్థులకు 10 మంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటాన్ని గమనించారు. హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన ఆమె, విద్యాబోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ఆర్‌ఓ తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై గ్రామ పటేల్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యుల వివరాలను కూడా ఫారమ్‌లలో నమోదు చేసి సంబంధిత బీఎల్‌ఓలకు అందజేయాలని గ్రామస్తులకు సూచించారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లీగల్ నోటీసులు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ అంశంలో చేసిన ఆరోపణలపై 48 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ''ఎలాంటి ఆధారాలు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేశారు. గ్లోబరీనా సంస్థతో నాకు ఎలాంటి ఆర్థిక సంబంధాలు, యాజమాన్య హక్కులు లేవు. గ్లోబరీనా నా బినామీ కంపెనీ అనడం.. సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించాననడం పూర్తిగా అవాస్తవం. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉంటూ నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు. రాజకీయ లబ్ధికోసమే నా ప్రతిష్ఠను దెబ్బతీసేలా దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేశారు. గడువులోపు క్షమాపణ చెప్పకపోతే సివిల్, క్రిమినల్ చర్యలతో పాటు పరువు నష్టం దావా వేస్తాం'' అని కేటీఆర్ అన్నారు.

# మొబైల్ ఫోన్ల రికవరీలో మెదక్ జిల్లా రాష్ట్రంలో మూడో స్థానం

* మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 142 సెల్‌ఫోన్లను కేవలం 22 రోజుల్లో రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్ల మొత్తం విలువ రూ.21,84,800 ఉంటుందని పేర్కొన్నారు. తమ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేసి జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు మెదక్ జిల్లా పోలీసులు 4,038 సెల్‌ఫోన్లను రికవరీ చేసి,కమిషనరేట్లను మినహాయిస్తే రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు. మొబైల్ ఫోన్ల రికవరీ కోసం ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా నియమించి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ప్రజలు www.ceir.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయడంతో పాటు సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. మొబైల్ ఫోన్ IMEI నంబర్ అందుబాటులో ఉంటే రికవరీ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని తెలిపారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, మార్కెట్, రైతుబజార్ తదితర రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ చోరీలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు తమ మొబైల్ ఫోన్లను ఇవ్వకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. సెల్‌ఫోన్ షాపులు, రిపేరింగ్ కేంద్రాల నిర్వాహకులు పాత మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసే సమయంలో యజమాని వివరాలు, సరైన ధ్రువపత్రాలు, IMEI నంబర్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు జార్జ్,రాజశేఖర్ రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది విజయ్, మహేందర్, వెంకట్ గౌడ్, జిల్లాలోని సీఈఐఆర్ పోర్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగాల నియామకంలో అన్యాయం జరిగింది

* విచారణ జరిపి న్యాయం చేయాలి

దగ్గుబాటి సామ్రాజ్యం




ప్రజాస్ఫూర్తి/ఖమ్మంజిల్లా : గ్రామంలో జరిగిన ఉద్యోగాల నియామక ప్రక్రియలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని దగ్గుబాటి సామ్రాజ్యం ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలు ఉన్నప్పటికీ తనను పక్కనపెట్టి, అర్హత లేని లేదా తక్కువ అర్హతలు కలిగిన ఇతర వ్యక్తులకు ఉద్యోగాలు కట్టబెట్టారని ఆమె ఆరోపించారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్ లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగాల ఎంపిక విషయంలో గ్రామ అధికార పార్టీ నాయకులు,సంబంధిత ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై వ్యవహరించినట్లు అనుమానం వ్యక్తం చేశారు.ఇంటర్వ్యూ పేరుతో అభ్యర్థులను రోజుల తరబడి కాలయాపన చేయించి, చివరకు నిబంధనలకు అనుగుణంగా ఇంటర్వ్యూ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. కేవలం ఒక నిమిషం పాటు ఇంటర్వ్యూ నిర్వహించి, అభ్యర్థుల అర్హతలు, విద్యార్హతలు, అనుభవాన్ని సరిగా పరిశీలించకుండా ఉద్యోగాలకు ఎలా ఎంపిక చేశారని ఆమె ప్రశ్నించారు.ఇంటర్మీడియట్ కనీస అర్హతగా ఉన్నప్పటికీ, దానికంటే ఎక్కువ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టి, స్థానిక నాయకులు కు నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ నియామకాల విషయంలో డబ్బులు చేతులు మారినట్లు తమకు అనుమానం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు,అందువల్ల ఈ మొత్తం వ్యవహారంపై అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగాల నియామకానికి సంబంధించిన దరఖాస్తులు, అభ్యర్థుల అర్హతలు, ఇంటర్వ్యూ ప్రక్రియ, ఎంపిక జాబితా, అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ వ్యవహారంపై సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి తగిన విచారణ జరపాలి. నాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలి. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా మళ్లీ పరిశీలించాలి" అంటూ విలేకరుల ఎదుట తన ఆవేదనను వ్యక్తం చేశారు. అలాగే మీడియా మిత్రులు కూడా తమకు సహకరించి, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జరిగిన అన్యాయంపై నిజానిజాలను వెలికితీసి, బాధితులకు న్యాయం జరిగేలా జర్నలిస్టులు తమ వంతు పాత్ర పోషించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి

* ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ ముట్టడి సక్సెస్
* జిల్లా కార్యదర్శి వరక అజిత్




ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి విజయవంతమైంది. వేలాదిమంది విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను కాలరాస్తూ, ప్రభుత్వ విద్యను బలహీనపరిచే విధానాలను కొనసాగిస్తే విద్యార్థుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని, "విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వ పతనం తప్పదు" అని హెచ్చరించారు. ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్స్ అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని , ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించాలని , వెంటనే పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఆయన చేస్తూ , విద్య హక్కు చట్టం అమలు చేయాలని ఆయన అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏవో కృష్ణ ప్రసాద్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలోఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిలు ఇనపల్లి పవన్ సాయి , గుండల సుజన్ ,మాణిక్యాల వినయ్ , గుగులోత్ వంశీ , జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు కొరిమీ సంజయ్ తదితరులు పాల్గొన్నారు .

# ఏ వయసులో ఎన్ని గంటలు నిద్ర అవసరం?

శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక వ్యక్తికి తగినంత నిద్ర అవసరం. మంచి నిద్ర మిమ్మల్ని రోజంతా శక్తివంతంగా ఉంచడమే కాకుండా మిమ్మల్ని మీ మూడ్ ని బాగు చేస్తుంది. మీరు మంచి అనుభూతి చెందుతూ.. నిద్రలో శరీరంలో ఉత్పత్తి అయ్యే కొన్ని హార్మోన్లు కణాలను సరిచేయడం ద్వారా శరీరం శక్తి వినియోగాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి.





సీడీఓ ప్రకారం.. రాత్రికి ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోయే వ్యక్తులు మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా నిద్రపోకపోవడం వల్ల ఆరోగ్యానికి కలిగే హానిని తెలుసుకున్న తర్వాత, ఏ వయస్సులో ఉన్న వ్యక్తి ఎన్ని గంటలు నిద్రపోవాలో ఇప్పుడు తెలుసుకుందా.. నేషనల్ స్లీప్ ఫౌండేషన్ తన అధ్యయనంలో ఎవరూ ఎన్ని గంటలు నిద్రపోవాలనే వివరాలు ఇలా ఉన్నాయి.

- 0-3 నెలలు: నిద్ర సమయం 14 నుంచి 17 గంటలు ఉండాలి.
- 4-11 నెలలు: 12 -15 గంటలు నిద్రించాలి.
- 14-17 సంవత్సరాలు: 8 -10 గంటలు. 7 గంటల కంటే తక్కువ,11 గంటలకు మించకూడదు.
- 18- 25 సంవత్సరాలు: 7 -9 గంటలు. 6 గంటల కంటే తక్కువ,11 గంటలకు మించకూడదు.
- 26- 64 సంవత్సరాలు: 7 నుంచి 9 గంటలు.
- 65 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ: 7 నుంచి 8 గంటలు.





కానీ కొంతమందికి వారి బిజీ లైఫ్‌స్టైల్ లేదా అలవాట్ల వల్ల తగినంత నిద్ర లేనప్పుడు.. వారికి కార్డియోవాస్క్యులర్ డిసీజ్, హై బ్లడ్ ప్రెజర్, డయాబెటిస్, ఒబేసిటీ, డిప్రెషన్, హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.



## జయమ్మ పోస్టర్‌తో రూమర్లకు చెక్

పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తోన్న రణబాలి మూవీ పోస్ట్‌పోన్ అవనున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ పోస్ట్‌పోన్ రూమర్లను మేకర్స్ కొట్టిపడేశారు. సెప్టెంబర్ 11నే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు హింట్ ఇచ్చేశారు. రష్మిక పోస్టర్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. ఇందులో జయమ్మ పాత్రలో రశ్మిక నటిస్తోంది. పెళ్లి కూతురిలా రెడీ అయ్యి ట్రెడిషనల్ లుక్‌తో ఆకట్టుకుంటుంది. విజయ్ సిక్స్‌ప్యాక్‌లో యోధుడిగా దర్శనమిచ్చాడు. ప్రస్తుతం ఈ కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా ఈ మూవీకి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. హిస్టారికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీలో హాలీవుడ్ నటుడు ఆర్నాల్ వోస్లో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు.

## విజయ్ మూవీ చూసిన త్రిష..

తమిళ సీఎం విజయ్‌తో రిలేషన్ వార్తల వేళ త్రిష ఏం చేసినా తెగ వైరలవుతోంది. విజయ్, పూజా హెగ్డే జంటగా నటించిన జననాయగన్ మూవీ గురువారం రిలీజైంది. అయితే ఈ మూవీని త్రిష ఉదయమే చూడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అందులో థియేటర్‌కు వెళ్లి మరీ మూవీ చూడటం అందరి దృష్టినీ ఆకర్షించింది. వైట్ టీ షర్ట్ బ్లూ జీన్స్ ధరించి స్టైలిష్ లుక్‌లో చెన్నైలోని రోహిణి థియేటర్ వద్ద త్రిష సందడి చేయగా ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతోన్నాయి. కాగా ఈ మూవీపై పలువురు సెలిబ్రిటీలు ట్వీట్స్, పోస్ట్‌లు పెడుతోన్నారు. విజయ్ ఫేర్‌వెల్ ట్రీట్ అదిరిపోయిందని అంటున్నారు. సెన్సార్ అడ్డంకుల కారణంగా వాయిదాపడిన ఈ మూవీ ఏడు నెలల తర్వాత ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకొచ్చింది.





## కండీషన్లు ఓకేనట!

ఫ్లాపుల్లో ఉన్న విలక్షణ దర్శకుడు మణిరత్నంతో ఓ సినిమా చేసేందుకు సాయిపల్లవి అంగీకరించడం తమిళనాట ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా షూటింగ్ మొదలుకాక ముందే సాయిపల్లవికి మణిరత్నం కొన్ని కండీషన్లు పెట్టాడట. ఏళ్లకు ఏళ్లు షూటింగ్ చేస్తాడనే విమర్శల నేపథ్యంలో కేవలం 40 రోజుల్లోనే షూటింగ్ కంప్లీట్ చేయాలని అనుకుంటున్నాడట. ఇందుకు తగ్గట్లుగానే డేట్స్ కేటాయించాలని సాయిపల్లవితో పాటు విజయ్ సేతుపతికి షరతులు పెట్టాడట. మణిరత్నం మీద ఉన్న గౌరవంతో సాయిపల్లవి ఓకే చెప్పిందట. గురువారం ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను సైలెంట్‌గా మొదలుపెట్టార కూడా. కోల్‌కతాలో ఫస్ట్ షెడ్యూల్‌ను చిత్రీకరించబోతున్నారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్నారు.

సినిమా

## రాధా రమణ పాట అదుర్స్

స్టార్ డైరెక్టర్ సందీప్ వంగా ప్రజెంటర్‌గా వ్యవహరిస్తోన్న తెలుగు మూవీ రోమాంచకం నుంచి ఫస్ట్ సింగిల్ వచ్చేసింది. చంద్రబోస్ లిరిక్స్ అందించిన రాధా రమణ పాటను గురువారం మేకర్స్ రిలీజ్ చేశారు. వాసుకి వైభవ్ సంగీతం అందిస్తూనే ఈ పాటను స్వయంగా ఆలపించారు. ఇందులో నాయకానాయికల కెమిస్ట్రీ, విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ సినిమాకు వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో రొమాంటిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతోన్న ఈ సినిమాను భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సందీప్ వంగా సోదరుడు ప్రణయ్ వంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని సెప్టెంబర్ 3న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు.






## హమ్మయ్యా.. శ్రీలీలకు మళ్లీ ఛాన్స్

ధమాకా బ్యూటీ శ్రీలీలకు ఎట్టకేలకు తెలుగులో ఓ ఛాన్స్ దక్కింది. ఫ్లాప్ హీరోతో ముచ్చటగా మూడోసారి జోడీ కట్టబోతోంది. నితిన్ హీరోగా ఆయ్ ఫేమ్ అంజి డైరెక్షన్‌లో ఓ ఫన్ ఫ్యామిలీ లవ్‌స్టోరీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో నితిన్ సరసన హీరోయిన్‌గా శ్రీలీలను ఫైనల్ చేశారట. ఈ ఇద్దరూ ఫ్లాపుల్లోనే ఉండటంతో లిమిటెడ్ బడ్జెట్‌లోనే ఈ సినిమాను తెరకెక్కించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. శ్రీలీల తన రెమ్యూనరేషన్‌ను కూడా తగ్గించుకోవడానికి అంగీకరించినట్లు వార్తలొస్తున్నాయి. నితిన్ స్వీయ నిర్మాణ సంస్థ శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్‌పై ఈ మూవీ రూపొందనుండగా త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుందట. వీరిద్దరూ కలిసి నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్‌హుడ్ సినిమాలు రాగా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ సినిమాతోనైనా వీరి జోడీ హిట్టు కొడుతుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.